పారిశుధ్యం నిర్వహణపై దృష్టి పెట్టండి

మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. పక్కన కలెక్టర్, మేయర్, కమిషనర్

ఖమ్మం, జూలై 13 : ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో నగరంలో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, మురుగు నీటి సమస్య తలెత్తకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. బ్రాండ్ ఇమేజ్ ఉండేలా నగర సమగ్రాభివృద్ధి జరగాలని, ప్రశాంత వాతావరణంపై అన్ని వర్గాలకు భరోసా కలగాలన్నారు. ఖమ్మం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో నగరాభివృద్ధిపై కార్పొరేటర్లు, అధికారులతో మంత్రి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఇండ్లు నిర్మించుకొని ఇంకా నెంబర్లు లేని వారికి నిబంధనల మేరకు ఇంటి నెంబర్లు ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో రోడ్లు, వీధులు పరిశుభ్రంగా ఉండే చర్యలు చేపట్టాలని, డ్రైనేజీల్లో మురుగు నీరు నిల్వకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, పైపులైన్ లీకేజీలు ఉంటే వెంటనే వాటిని సరి చేయాలన్నారు. రోడ్ల వెడల్పునకు ప్రజలు సహకరించాలని, భారీ వాహనాలు నగరంలోకి రాకుండా హైదరాబాద్ తరహాలో అమరావతి-దేవరపల్లి రింగ్ రోడ్ నిర్మాణం చేపడుతామన్నారు. రోడ్లన్నింటికి సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత ముఖ్యమంత్రితో సమావేశం ఏర్పాటు చేసి.. నగరాభివృద్ధి పనులకు కార్యరూపం తెస్తానన్నారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి ప్రణాళిక రూపొందించడంతోపాటు ఆదాయం పెంపునకు ప్రణాళికాబద్ధ చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై ముందస్తుగా హెచ్చరికలు చేస్తే యజమానులు సర్దుబాటు చేసుకుంటారని కలెక్టర్ తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ శానిటేషన్ నిర్వహణపై ప్రణాళిక రూపొందించామని, దీనిని వార్డులవారీగా కార్పొరేటర్లకు అందజేయనున్నట్లు తెలిపారు. ఏబీసీ కేంద్రం ద్వారా త్వరలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు నగరపాలక సంస్థకు మంత్రి హోదాలో వచ్చిన మంత్రిని మేయర్, కార్పొరేటర్లు సన్మానించారు. సమీక్షలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు, విద్యుత్ శాఖ ఎస్ఈ సురేందర్, ఆర్డీవో జి.గణేశ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బోడుకు బస్సు నడిపించండి..

రోడ్డెక్కి మహిళల ఆందోళన

బోడు గ్రామంలో బస్సు కోసం రోడ్డుపై నిరసన తెలుపుతున్న మహిళలు

టేకులపల్లి, జూలై 13 : తమ గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బోడు గ్రామానికి చెందిన మహిళలు శనివారం ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. మండల కేంద్రం నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ గ్రామానికి విశాలమైన రోడ్డు మార్గం ఉన్నా.. మధ్యలో 12 గిరిజన గ్రామపంచాయతీల ప్రజలకు ఉపయోగపడే అవకాశం ఉన్నా బస్సును ఎందుకు నడపడం లేదని వారు ప్రశ్నించారు. ప్రైవేటు వాహనాలకు అధిక చార్జీలు వసూలు చేస్తుండడంతో తాము ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని, తమకూ మహాలక్ష్మి సౌకర్యం కల్పించాలని కోరారు. గతంలో కొత్తగూడెం నుంచి బోడుకు, ఇల్లెందు నుంచి బోడుకు బస్సు సౌకర్యం ఉండేదని, దానిని ఎందుకు రద్దు చేశారో అర్థం కావడం లేదన్నారు. పాఠశాల, కళాశాలల విద్యార్థులు, ప్రజల సౌకర్యార్థం వెంటనే బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని పలువురు మహిళలు డిమాండ్ చేశారు. దీనిపై ఆర్టీసీ ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే కోరం కనకయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని వారు కోరారు. కార్యక్రమంలో బుర్ర పద్మ, మాడె పుల్లమ్మ, వాసం సోయమ్మ, మేనుగు స్వరూప, కుంజ సుకన్య, కుంజ పాపమ్మ, చిలువేరు ఝాన్సీ, పొదెం సుధీర్, గంగాధర శ్రీను, చిలువేరు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చింతోని చెలక బడిలో తాగునీటి తిప్పలు

- మోటర్ నీళ్లు మురికిగా రావడంతో తాగలేని పరిస్థితి
- ఇళ్ల నుంచే బాటిళ్ల లో నీళ్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు
- వాటర్ ఫిల్టర్లు లేదా ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని వినతి

చింతోని చెలక పాఠశాల బోరు నుంచి వచ్చిన మురికి నీరు

వాటర్ బాటిళ్లతో విద్యార్థులు

టేకులపల్లి, జూలై 13 : ఆ పాఠశాలలో చదువుతున్న వారంతా నిరుపేద గిరిజన విద్యార్థులే. చింతోనిచెలక తండా, రోడ్డుగుంపు, మేల్లమడుకు, చర్లపల్లి గ్రామాలకు చెందిన మొత్తం 82 మంది విద్యార్థులు వచ్చి పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజనంతోపాటు దుస్తులు, పాఠ్య, నోట్ పుస్తకాలు అందిస్తుండగా.. ఏడుగురు ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. పాఠశాలలో రెండు బోర్లు, రెండు వాటర్ ట్యాంకులు ఉన్నా.. ఆ నీళ్ల మురుగుతోపాటు చిలుము, కిరోసిన్ వాసన వస్తుండడంతో తాగలేక అవస్థలు పడుతున్నారు చింతోని చెలక గ్రామపంచాయతీ పరిధిలోని యూపీఎస్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు. మన ఊరు-మన బడి కార్యక్రమం కింద పాఠశాల చుట్టూ ప్రహరీ, వాటర్ ట్యాంకులు, చేతులు కడుక్కోవడానికి నల్లాలు ఏర్పాటు చేశారు. గతంలో మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నారు. ప్రస్తుతం ఆ నీరు రావడం లేదు. బోరు మోటర్, చేతి పంపుల ద్వారా వచ్చే నీరు చిలుము వాసనతోపాటు నలకలు రావడంతో తాగలేకుండా ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచే నీటి బాటిళ్లు తెచ్చుకుంటున్నారు. అవి మధ్యాహ్నం వరకే సరిపోవడంతో సాయంత్రం వరకు నీళ్లు లేక తండ్లాడుతున్నారు. వాటర్ ఫిల్టర్లు లేదా ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసి నీటి సమస్యను తీర్చాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

ఇంటి నుంచే నీళ్లు తెచ్చుకుంటున్నాం..

రోజూ పుస్తకాలతోపాటు నీళ్ల బాటిల్ తప్పకుండా తీసుకెళ్తున్నాం. బాటిల్ నీళ్లు కూడా మధ్యాహ్నం వరకే సరిపోతున్నాయి. ఊళ్లో ఉన్న బోర్ వద్దకు వెళ్లాలంటే కుక్కలు, కోతులు వెంటబడుతున్నాయి. సాయంత్రం ఇంటికి వెళ్లి నీళ్లు తాగాల్సి వస్తోంది. మా పాఠశాలకు మంచినీటి సౌకర్యం కల్పించి ఆదుకోండి సార్.

-లిఖిత భద్రావతి, 7వ తరగతి విద్యార్థిని

దాతలు ముందుకు రావాలి..

పాఠశాలలో తాగునీరు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మాకు రెండు బోర్లు ఉన్నా ఆ నీరు తాగలేని పరిస్థితి. బోరు నీరు ఫిల్టర్ చేయడానికి గ్రాడ్స్ లేక నీరు శుద్ధి కావడం లేదు. ఈ సమస్యను పరిష్కరించడానికి సింగరేణి లేదా నవభారత్ కంపెనీలు లేదా దాతలు ముందుకొచ్చి సహకరించాలని కోరుతున్నాం. **-శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం**

నీళ్ల కోసం రోజూ ఇబ్బందే..

పాఠశాల పిల్లలకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నాం. అయితే వంట చేయడానికి కూడా బోర్ నీళ్ల ఉపయోగపడడం లేదు. గ్రామంలోని బోర్ నుంచి రోజూ నీళ్లు తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉంది. పిల్లలు తాగడానికి, చేతులు కడుక్కోవడానికి కూడా నీళ్లు లేవు. నీటి సమస్య పరిష్కారమయ్యేలా చూడాలి. **-మెట్ల సుశీల, మధ్యాహ్న భోజన నిర్వాహకులు**

గురుకులంలో సౌకర్యాలు లేవంటూ..

రోడ్డుపై బైఠాయించి తల్లిదండ్రుల నిరసన

మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్

పోలీసుల హామీతో ఆందోళన విరమించిన తల్లిదండ్రులు

రోడ్డుపై నిరసన తెలుపుతున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

వైరారూరల్, జూలై 13 : రెబ్బవరం గ్రామంలోని జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు సరిగా లేవని, భోజనం సరిగ్గా అందించడం లేదని ఆరోపిస్తూ విద్యార్థినుల తల్లిదండ్రులు రెబ్బవరం ప్రధాన రహదారిపై శనివారం బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల తల్లిదండ్రులు మాట్లాడుతూ హాస్టల్‌లో తాగునీరు, మరుగు దొడ్లు, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివించే స్థోమత లేకపోవడంతో ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చేర్పించి చదివిస్తున్నామని, ఇక్కడ ఇలాంటి పరిస్థితులు ఉంటే వారికి చదువు ఎలా మెదడుకు ఎక్కుతుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హాస్టళ్ల నిర్వహణపై దృష్టి పెట్టడం లేదని, మౌలిక సౌకర్యాలు సమకూర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. హాస్టళ్ల నిర్వహణను పట్టించుకోని అధికారులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గురుకుల పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, వారి చదువుకు ఆటంకం కలగకుండా చూడాలని కోరారు. కాగా.. పోలీసులు రోడ్డుపై ఆందోళన చేస్తున్న మహిళలకు నచ్చజెప్పడంతోపాటు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మా భూమి ఇవ్వకపోతే చావే శరణ్యం..

పోడు పట్టా ఉన్నా.. అటవీ అధికారుల దౌర్జన్యం ఆపట్లేదు

- బాధితులు బానోత్ సునీత, వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న బాధితులు

ఇల్లెందు రూరల్, జూలై 13: పోడు పట్టా ఉన్నా అటవీశాఖ అధికారులు వేధిస్తున్నారని బాధితులు బానోత్ సునీత, వెంకటేశ్వర్లు ఆరోపిస్తున్నారు. మా భూమి మాకు ఇవ్వాలని.. లేకపోతే చావే శరణ్యమని బాధితులు వాపోయారు. మండల పరిధిలోని బొంబాయితండాల్లో మాజీ సర్పంచ్ ధరావత్ దేవిజ, సర్పంచ్ సరోజిని, వార్డు మెంబర్ భూక్య సురేష్‌తో కలిసి బాధితులు శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2005లో రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో మాకు పోడు సాగుకు పట్టాలు ఇచ్చారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, క్రాప్‌లోన్లు కూడా తీసుకున్నాము. అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉన్నా అనంతారం బీట్ ఆఫీసర్ శ్రీవిద్య, సెక్షన్ ఆఫీసర్ సురేష్ దౌర్జన్యంగా మా భూమిలో మొక్కలు నాటుతున్నారు. గతంలో మేము సాగు చేసిన 20 ఎకరాల్లో 18 ఎకరాలు ఫారెస్టు అధికారులకే వదిలేశాము. పట్టా ఉన్న 2.20 కుంటల భూమిలోనే సాగు చేసుకుంటూ జీవిస్తున్నాం. పట్టా కలిగిన భూమినే కూడా సాగు చేసుకోకుండా చేస్తున్నారని ఆవేదన వెళ్లగక్కారు. రాజశేఖర్‌రెడ్డి, కేసీఆర్ ప్రభుత్వాల హయాంలో రైతు సంక్షేమ పథకాలు తీసుకున్నామని, మా భూమి మాకు అప్పజెప్పాలని, ఫారెస్టు అధికారుల దౌర్జన్యాలు ఆపాలని, లేకపోతే చావే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు.

కోర్టు తీర్పు ప్రకారం నడుచుకుంటున్నాం

ఫారెస్టు అధికారులపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. వారు మాది అని చెబుతున్న భూమి ప్లాంటింగ్ మధ్యలో ఉంది. రెండు, మూడు సంవత్సరాలుగా భూమి జోలికి వెళ్లలేదు. మ్యాప్‌లో ఉన్న ఏరియా ప్రకారం ట్రెంచ్ కొట్టుకుని ప్లాంటేషన్ చేస్తున్నాం. 2021లో కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు నడుచుకుంటున్నాం. కోర్టు తీర్పును ధిక్కరిస్తూ మా బీట్ ఆఫీసర్ శ్రీవిద్య పై బెదిరింపులు, దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. భూమిలో నాటిన మొక్కలను తీసివేసి దాడికి ప్రయత్నిస్తున్నారు.

– సెక్షన్ ఆఫీసర్ సురేష్, కొమరారం రేంజ్, ఇల్లెందు

వాణిజ్య



డీ-మార్ట్ లాభం 774 కోట్లు

న్యూఢిల్లీ, జూలై 13: డీ-మార్ట్ పేరుతో రిటైల్ అవుట్‌లెట్లను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.773.68 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అమ్మకాలు పెరగడం వల్లనే గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.658.71 కోట్ల లాభంతో పోలిస్తే 17.45 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 18.57 శాతం ఎగబాకి రూ.11,865.44 కోట్ల నుంచి రూ.14,069.14 కోట్లకు చేరుకున్నది. నిర్వహణ ఖర్చులు 18.62 శాతం పెరిగి రూ.13,056.61 కోట్లకు చేరాయి. ఈ సందర్భంగా అవెన్యూ సూపర్‌మార్ట్స్ సీఈవో, ఎండీ నెవిల్లి నోరోన్హా మాట్లాడుతూ..గత త్రైమాసికంలో కొత్తగా ఆరు స్టోర్లను ప్రారంభించడంతో మొత్తం సంఖ్య 371కి చేరుకున్నాయన్నారు.

5.74 లక్షల కోట్లకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు

న్యూఢిల్లీ, జూలై 13: ప్రత్యక్ష పన్ను వసూళ్లలో రెండంకెల వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 19.54 శాతం పెరిగి రూ.5.74 లక్షల కోట్లు వసూలైనట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) వెల్లడించింది. కార్పొరేట్ సంస్థలు అధికంగా అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లింపులు జరపడం ఇందుకు కారణమని తెలిపింది. అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు 27.34 శాతం ఎగబాకి రూ.1.48 లక్షల కోట్లకు చేరాయి. దీంట్లో కార్పొరేషన్ ఆదాయ పన్ను(సీఐటీ) వసూళ్లు 1.14 లక్షల కోట్లు కాగా, వ్యక్తిగత ఆదాయ పన్ను (పీఐటీ) రూ.34,470 కోట్లని పేర్కొంది. ఈ నెల 11 నాటికి నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.5,74,357 కోట్లు కాగా, వీటిలో సీఐటీ రూ.2,10,274 కోట్లు, పీఐటీ రూ.3,46,036 కోట్లని తెలిపింది. అలాగే రూ.70,902 కోట్లను రిఫండ్ రూపంలో చెల్లించింది.



లైఫ్ సైన్సెస్ పాలసీ ఎప్పుడో?

4 నెలలు దాటినా ఊసేలేని కొత్త విధానం

లైఫ్ సైన్సెస్ గ్రిడ్ స్ట్రాటజీపై తీవ్ర నిర్లక్ష్యం

ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుకు భూముల కొరత

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): దేశ ఔషధ రాజధానిగా హైదరాబాద్‌కు ఉన్న ఖ్యాతి రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీనత వల్ల మసకబారే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఫార్మా రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. చేతల్లో మాత్రం ఏమీ చేయలేక పోతున్నది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధం చేసిన ఫార్మాసిటీని రద్దు చేసి, 3 చోట్ల ఫార్మా విలేజ్‌లను నెలకొల్పుతామని రేవంత్ సర్కారు ప్రకటించినప్పటికీ వాటి జాడ ఎక్కడా కానరావడం లేదు. లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రవేశపెడతామని ప్రకటించి 4 నెలలు దాటినా ఇంతవరకు దాని ఊసే లేదు. కనీసం ఆ దిశగా కసరత్తు జరుగుతున్న దాఖలాలు కూడా లేవు. ఈ నెల 5న హైదరాబాద్‌లో ప్రారంభమైన ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో ఈ పాలసీని విడుదల చేస్తారని అందరూ భావించినప్పటికీ నిరాశే ఎదురైంది. ప్రస్తుతం ఆ పాలసీపై మాట్లాడేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. తమకు ఎలాంటి సమాచారం లేదని చెప్తున్నారు. వాస్తవానికి ఫార్మా రంగంలో హైదరాబాద్‌కు ఎన్నో అనుకూలతలు ఉన్నాయి. వాటికి తోడుగా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఎకోసిస్టంవల్ల పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. అనేక ఆర్‌అండ్‌డీ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి లైఫ్ సైన్సెస్ రంగంలో మరింత ఉజ్వల భవిష్యత్తు ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ, రేవంత్ ప్రభుత్వం నుంచి ఈ రంగానికి ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం అందడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రిడ్ స్ట్రాటజీపై నిర్లక్ష్యం

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని లైఫ్ సైన్సెస్ హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించింది. రానున్న పదేండ్లలో లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టంను 100 బిలియన్ డాలర్ల స్థాయికి పెంచాలని, తద్వారా 4 లక్షల ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా లైఫ్ సైన్సెస్ గ్రిడ్ స్ట్రాటజీని ప్రకటించింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని కూడా నిర్లక్ష్యం చేస్తున్నది. రాష్ట్రంలో 10 గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్.. తొలుత నల్లగొండ, మెదక్, వికారాబాద్‌లో సుమారు 1000 నుంచి 2000 ఎకరాల విస్తీర్ణంలో వీటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇది జరిగి 4 నెలలు దాటినా ఎలాంటి పురోగతి లేదు. క్షేత్ర స్థాయిలో మాత్రం భూముల కొరత వెంటాడుతున్నది. నల్లగొండ, మెదక్‌లో భూములు లేవని కలెక్టర్లు స్పష్టం చేయడంతో వికారాబాద్, జహీరాబాద్‌లో ల్యాండ్ పూలింగ్ విధానంలో ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం హైదరాబాద్ శివార్లలో ఫార్మాసిటీని అభివృద్ధి చేసేందుకు దాదాపు 13 వేల ఎకరాలు సేకరించింది. దీనికి కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు కూడా రావడంతో భూముల కోసం అనేక కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేయడం, కొత్త ఫార్మా విలేజ్‌లు ఇంకా కార్యరూపం దాల్చకపోవడంతో పరిశ్రమ వర్గాలు అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి.



టీ కన్సల్ట్‌ను ప్రారంభిస్తున్న కంపెనీ సీఈవో సందీప్ మక్తల తదితరులు

టీజీఐపీని ప్రారంభించిన టీ కన్సల్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 13 (నమస్తే తెలంగాణ): తెలుగు స్టార్టప్‌లకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు అందించడమే లక్ష్యంగా ఏర్పాటైన టీ కన్సల్ట్.. తొలి సారిగా గ్లోబల్ ఇన్వెస్టర్ పూల్‌ను ప్రారంభించింది. ఈ విషయాన్ని కంపెనీ సీఈవో సందీప్ మక్తల తెలిపారు. దుబాయ్ వ్యాపారవేత్త బూ అబ్దుల్లాతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు, తద్వారా మన వ్యాపారాలకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి వీలుంటుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన అబ్దుల్లా కంపెనీతో టీ కన్సల్ట్ ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ఎంతో మేలు చేయనున్నదని, ముఖ్యంగా ఆవిష్కరణ రంగంలో ప్రత్యేక నైపుణ్యతను కలిగివున్న తెలుగు వారికి అంతర్జాతీయ అవకాశాలను సొంతం చేసుకునేందుకు ఇది మంచి వేదికని సందీప్ మక్తల తెలిపారు.

బీఎస్ఎన్ఎల్-ఎంటీఎన్ఎల్ విలీనం లేనట్టే!

న్యూఢిల్లీ, జూలై 13: ప్రభుత్వరంగ టెలికం సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌లను విలీనం చేసే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తున్నది. కేవలం మహానగర్ టెలిఫోన్ నిగం లిమిటెడ్(ఎంటీఎన్ఎల్)కి చెందిన కార్యకలాపాలను బీఎస్ఎన్ఎన్‌కు అప్పగించేయోచనలో సర్కార్ ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తున్నది. ప్రస్తుతం ఆ దిశగా చర్యలు జరుగుతున్నాయని, దీనికి మరో నెల రోజులు సమయం పట్టే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న ఎంటీఎన్ఎల్‌ను బీఎస్ఎన్ఎల్‌లో విలీనం చేయడం ఎంతమాత్రం సమంజసం కాదని ఆ వర్గాలు భావిస్తుండటం వల్లనే కార్యకలాపాలు మాత్రమే మార్చాలని యోచిస్తున్నది. తొలుత సెక్రటరీల కమిటీ ఈ ప్రతిపాదనను ఉంచిన తర్వాత క్యాబినెట్ ఆమోదానికి పంపిస్తారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 20న ఎంటీఎన్ఎల్ బాండ్ల ద్వారా సేకరించిన నిధులకు వడ్డీలను చెల్లించాల్సి ఉన్నది. ప్రస్తుతం ఎంటీఎన్ఎల్..ఢిల్లీ, ముంబైలలో మాత్రమే టెలికం సేవలు అందిస్తుండగా, బీఎస్ఎన్ఎల్ మిగతా దేశవ్యాప్తంగా అందిస్తున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎంటీఎన్ఎల్ రూ.3,267.5 కోట్ల నష్టం వచ్చింది.

నయా కార్లు వచ్చేస్తున్నాయ్..

న్యూఢిల్లీ, జూలై 13: కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాలు నయా మాడళ్లను అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. ప్రస్తుత నెలలో కూడా సరికొత్త మాడళ్లను ప్రవేశపెట్టబోతున్నాయి. వీటిలో టాటా, నిస్సాన్, హ్యుందాయ్, మెర్సిడెజ్, బీఎండబ్ల్యూ వంటి అరడజన్‌కు పైగా సంస్థలు తమ కొత్త మాడళ్లను విడుదల చేయబోతున్నాయి. దీంట్లో ప్రీమియం సెడాన్, లగ్జరీ హ్యాచ్‌బ్యాక్, పలు ఎస్‌యూవీలతోపాటు ఎలక్ట్రిక్ కార్లు కూడా ఉన్నాయి. వీటి వివరాలు..

టాటా కర్వ్ ఈవీ

టాటా మోటర్స్ ఈవీల పరిధిని మరింత విస్తరించడంలో భాగం మరో మాడల్‌ను విడుదల చేయడానికి రెడీ అయ్యింది. టాటా కర్వ్ ఈవీ పేరుతో విడుదల చేయనున్న ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 500 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇవ్వనున్నది. ఈ కారు ధర రూ.20 లక్షల కంటే అధికంగా ఉంటుందని అంచనా. 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్, 10.25 అంగుళాల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది. ఈ మాడల్‌నే ఈ నెల చివర్లో అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నది.

నిస్సాన్ ఎక్స్-ట్రైల్

దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టి దశాబ్ద కాలం పూర్తైన సందర్భంగా నిస్సాన్..ఫోర్త్ జన రేషన్ అవతార్ మాడల్‌ను ప్రవేశపెట్టడానికి సిద్ధమైంది. ప్రీమియం టచ్ ఇన్‌సైడ్, 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్, అడాస్, 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్, 8 స్పీడ్ సీవీటీ ఆటోమేటిక్‌గా ఈ మాడల్‌ను రూపొందించింది.

హ్యుందాయ్ అల్కాజర్ నయా..

అల్కాజర్‌లో నయా మాడల్‌ను మార్కెట్లోకి విడుదల చేయడానికి సిద్ధమైంది హ్యుందాయ్ మోటర్. ఈ నెల చివర్లో అందుబాటులోకి రానున్న ఈ కారు ధర రూ.17 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. పెట్రోల్, డీజిల్ ఇంజిన్‌తో తయారైన ఈ మాడల్‌లో 10.25 ఇంచుల స్క్రీన్, డ్యూయల్-జోన్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, ఏడు ఎయిర్ బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి.

బీఎండబ్ల్యూ 5 సిరీస్

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ.. ఎనిమిదో జనరేషన్ 5 సిరీస్ మాడళ్లను మార్కెట్లోకి విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే ఈ మాడళ్లు అంతర్జాతీయ మార్కెట్లో లభ్యమవుతున్నాయి. డ్యూయల్ డిజిటల్ స్క్రీన్, 4-జోన్ క్లైమెట్ కంట్రోల్, ఏడీఏఎస్, పెట్రోల్, డీజిల్ తోపాటు హైబ్రిడ్ కూడా తయారు చేసింది.

బీఎస్ఎన్ఎల్ బాస్‌గా రాబర్ట్

న్యూఢిల్లీ, జూలై 13: ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పీకే పుర్వార్ పదవి కాలాన్ని కేంద్ర ప్రభుత్వం పొడగించలేదు. దీంతో టెలికం అధికారి రాబర్ట్ జే రవికి కంపెనీ సీఎండీగ